

బీసీ హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, జూన్ 12: ప్రీమెట్రిక్ బీసీ వసతి గృహాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బషీరాబాద్ బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ స్వప్న తెలిపారు. బీసీ హాస్టల్‌లో 3నుంచి పదోతరగతి వరకు 82 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బోనఫైడ్, కులం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, మార్కుల జాబితాతో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

సందడిగా..

- ప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- మొదటి రోజు అంతంత మాత్రంగానే విద్యార్థుల హాజరు శాతం



నూతన్‌కల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్



స్టేషన్ ధారూరు పాఠశాలలో తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

వికారాబాద్/మేడ్చల్ , జూన్ 12(ఆంధ్రజ్యోతి) : బడి గంట మోగింది. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉత్సాహంగా విద్యార్థులు బడిబాట పట్టారు. విద్యార్థుల రాకతో స్కూళ్లలో సందడి వాతావరణం నెలకొంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలలను సుందరీకరించారు. వికారాబాద్, మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. ఉదయమే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంతో సందడి నెలకొంది. కొన్ని పాఠశాలల్లో మామిడి ఆకులతో తోరణాలు కట్టి అలంకరించి విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. జిల్లాలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఉదయమే సిబ్బంది శుభ్రం చేసి సిద్ధం చేశారు. తాగునీటి వసతి వంటివి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్న భోజనం కూడా అందించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు కూడా అందజేశారు. మొదటి రోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం అంతంత మాత్రంగానే ఉంది. దాదాపు సగానికి పైగా విద్యార్థులు పాఠశాలలకు రాలేదు. చాలా రోజుల తరువాత స్నేహితులు కలవడంతో విద్యార్థులు ఆప్యాయతతో పలుకరించుకోవడం కనిపించింది. మేడ్చల్ జిల్లా నూతన్‌కల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను కలెక్టర్ గౌతమ్ అందజేశారు. ఆయా పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు.

ఉపాధ్యాయుల రాక కోసం విద్యార్థుల నిరీక్షణ

మోమిన్‌పేట్ : పాఠశాలలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మోమిన్‌పేట మండలంలోని ఎన్కతల గ్రామంలో ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలకు మొదటి రోజు తాళం తెరవలేదు. ఉపాధ్యాయుల రాకకోసం విద్యార్థులు పాఠశాల ఆవరణలో నిరీక్షించారు. ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు టేకులపల్లి నుంచి గత సంవత్సరం డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎన్కతల గ్రామంలో ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కాగా మోమిన్‌పేట్ మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రం నుంచి ఉపాధ్యాయులు విద్యార్థులతో పుస్తకాలను ఆటోలు, కార్లలోకి మోయించారు.



ఎదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో తోటి స్నేహితులతో ముచ్చటిస్తున్న విద్యార్థులు



కొడంగల్ మండలంలో బడిబాటలో భాగంగా పాఠశాలలో చేరిన విద్యార్థులు



ఎన్కతలలో ఉపాధ్యాయుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

అమ్మ అదర్శ పాఠశాలలకు రూ.12 కోట్లు

మేడ్చల్‌టౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించటానికి ప్రభుత్వం తరఫున జిల్లాకు రూ.12 కోట్లు మంజూరు చేశామని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం నూతన్‌కల్‌గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. తను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు ఈ స్థితికి చేరానని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందజేశారు. నూతన్‌కల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి లక్ష్మీ ప్రసన్నకు అత్యధిక మార్కులు సంపాదించటంతో కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ కుమారి, డీఆర్‌డీవో సాంబశివరావు, ప్రత్యేక అధికారి మేరీరేఖా, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయేందర్ రెడ్డి, తహసీల్దార్ శైలజ, ప్రధానోపాధ్యాయుడు కొండయ్య పాల్గొన్నారు.



నూతన ఆసుపత్రిని ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తాం

- బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసింది
- స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు/మోమిన్‌పేట్, జూన్ 12: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో 11 ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని కేరెల్లి గ్రామంలో బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాఠశాల విద్యార్థులకు దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పల్లెలో పేదలకు విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 లక్షల మంది విద్యార్థులకు దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధించకుంటే జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంకు, తనకు, జిల్లా కలెక్టర్‌కు, తల్లిదండ్రులకు చెడ్డపేరు వస్తుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని స్వచ్ఛంద సంస్థలు, కార్పోరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలను కోరానని, లయన్స్ క్లబ్ వారు ధారూరు, కేరెల్లి పాఠశాలలో రూ.10లక్షలతో మరుగుదొడ్లను నిర్మిస్తున్నారన్నారు.గత ప్రభుత్వం అమలు చేసిన 317 జీవో పై ప్రభుత్వ సబ్ కమిటి వేసిందని, ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతా మహేందర్ రెడ్డి, రాష్ట్ర పాఠశాలల అభివృద్ధి అధికారి(ఎస్పీడీ) మల్లయ్య భట్టు, కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈవో రేణుకాదేవి, ఎంపీపీ విజయలక్ష్మి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాములు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వాసుపత్రిని ప్రారంభించినట్లు ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఎంపీ, స్పీకర్, జడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డిలు కలిసి నూతన ప్రభుత్వాసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రూ. 1.56కోట్లతో నిర్మించిన ఆసుపత్రిలో అన్నీ రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ వసంత వెంకట్, కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో పాల్వాన్‌కుమార్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ మనోహచ చక్రవర్తి, వైద్యులు సుజల, ఏఈ ప్రణీత్, శంకర్‌యాదవ్, లక్ష్మారెడ్డి, నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, సిరాజుద్దీన్, మానెయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఈ విద్యా సంవత్సరంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనకు ఇక్కట్లు తప్పేలా లేవు. పాఠశాలలు తెరిచేలోగా నెలకొన్న ఉపాధ్యాయుల కొరత పరిష్కారమవుతుందని ఆశించినా ఆ దిశగా చర్యలు కరువయ్యాయి. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఉపాధ్యాయులను నియమించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచే ప్రయత్నం కత్తిమీద సాములా మారుతోంది.



- జిల్లాలో ఉపాధ్యాయుల కొరత.. ఖాళీలతో తప్పని ఇబ్బందులు
- విద్యా సంవత్సరం ప్రారంభం
- విద్యా వలంటీర్ల నియామకంపై స్పష్టత కరువు



విద్యా బోధన సాగేదెట్లా!

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్నత పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టుల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉండడంతో ఆ ప్రభావం పది ఫలితాలపై పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ప్రభావం పదో తరగతి ఉత్తీర్ణతపై తీవ్ర ప్రభావం చూపింది. ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో అట్టడుగున నిలిచిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉన్న ఉన్నత పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థుల చదువులు కొనసాగేలా చర్యలు తీసుకున్నా ఆశించిన స్థాయిలో ఫలితం లేకపోయింది. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తప్పేలా లేదు. 2017 టీఆర్‌టీలో ఎంపికైన ఉపాధ్యాయుల నియామకాల తరువాత విద్యా వలంటీర్ల ప్రక్రియ నిలిపివేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో డీఎస్సీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉపాధ్యాయ అర్హత పరీక్షల (టెట్) ప్రక్రియ ముగిసిన అనంతరం జూన్ 12న ఫలితాలు ప్రకటించి.. ఆ తరువాత డీఎస్సీ షెడ్యూల్ విడుదల చేయాలని విద్యా శాఖ భావిస్తోంది. డీఎస్సీ ఫలితాలు ప్రకటించి నియామకాలు చేపట్టే వరకు మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యార్థులు నష్టపోకుండా విద్యా వలంటీర్లను నియమించి.. వారితో విద్యాబోధన చేయిస్తారా ? లేక గత ఏడాది మాదిరిగానే ఉపాధ్యాయులను ఉన్న చోటు నుంచి లేని పాఠశాలలకు సర్దుబాటు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

జిల్లాలో 1068 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు

జిల్లాలో 1068 ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 776, ప్రాథమికోన్నత 111, ఉన్నత పాఠశాలలు 176, ఎయిడెడ్ పాఠశాలలు 5 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 84448 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో విద్యా బోధన చేసేందుకు 4617 ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 3944 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అన్ని కేటగిరిలకు సంబంధించి 750 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో ఎస్‌జీటీ, పీఈటీ, ఆ కింది పోస్టులు మినహా జీహెచ్‌ఎం, ఎల్‌ఎఫ్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం పదోన్నతులు, మిగతా 30 శాతం మాత్రం డీఎస్సీ నియామకాలతో భర్తీ చేయాల్సి ఉంటుంది.

ఫలితాలు అంతంతే..

పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత కారణంగా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదనే వాదన ఉంది. ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా ...మెరుగైన ఫలితం దక్కట్లేదని చెబుతున్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు రెండు పోస్టులు అవసరం ఉండగా, ఒక్కరితోనే నెట్టుకు వస్తున్నారు. ఓ పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంటే, మరో పాఠశాలలో ఎక్కువగా ఉంటోంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అత్యవసర పరిస్థితుల్లో విధులకు హాజరు కాకపోతే ఆ రోజు పాఠశాలలకు అనధికార సెలవుగా మారుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటేనే పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడడానికి అవకాశం ఉంటుంది. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఉపాధ్యాయులను నియమించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచే ప్రయత్నం కత్తి మీద సాములాంటిదేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యా ప్రమాణాలు పెరిగితేనే..

విద్యా ప్రమాణాలు పెరిగితేనే ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరగనుంది. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం చేకూరే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా పాఠశాలల పున: ప్రారంభించే నాటికి విద్యా వలంటీర్లను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గతంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు అర్హత కలిగిన వారిని విద్యా వలంటీర్లుగా నియమించిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం మళ్లీ విద్యా వలంటీర్లను నియమిస్తామని ప్రకటించడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని భావిస్తున్నారు. అయితే ఈ విషయమై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు.

ఆరు నెలలు గడిస్తేనే కొత్త ఉపాధ్యాయులు

ఇదిలా ఉంటే, గత మార్చి నెలలో జిల్లాలో 359 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టుల్లో 102 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 195 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులు, 23 లాంగ్వేజ్ పండిత్, 5 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు ఉన్నాయి. అంతే కాకుండా స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 6 స్కూల్ అసిస్టెంట్, 28 ఎస్‌జీటీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించింది. మొత్తం 195 ఎస్‌జీటీ పోస్టుల్లో 169 తెలుగు మీడియం, 26 ఉర్దూ మీడియం పోస్టులు ఉన్నాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ 5 పోస్టులు, లాంగ్వేజ్ పండిత్ హిందీ 11, తెలుగు పండిత్ 8, ఉర్దూ పండిత్ 3, సంస్కృతం ఒక పోస్టు ఉంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 102 ఉండగా, వాటిలో బయోసైన్స్ 21, ఇంగ్లీష్ 23, హిందీ 3, తెలుగు 9, ఉర్దూ 3, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, ఫిజికల్ సైన్స్ 6 (తెలుగు 4, ఉర్దూ 2), సోషల్ స్టడీస్ 25 (తెలుగు 23, ఉర్దూ 2), తెలుగు 7, ఉర్దూ 2 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

మిషన్ భగీరథపై సర్వే!

- క్షేత్రసాయిలో నీటి సరఫరాపై ఆరా

మేడ్చల్ జూన్ 12(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. గత ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.వేల కోట్లు వెచ్చించింది. మేడ్చల్ జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఆశించిన మేర మిషన్‌భగీరథ నీటి సరఫరా కావడం లేదు. కొన్ని చోట్ల పూర్తికాని పైపులైన్ల నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంకులు, అక్కడక్కడ పైపులైన్ల లీకేజీతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రతి ఇంటికి అవసరాలకు సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదు. మరికొన్ని ఇళ్లల్లో ఇంకా నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. 2015లో ఈ పథకం ప్రారంభించగా అప్పుడు ఉన్న ఇళ్ల గణాంకాల ప్రకారం పైపులైన్ నిర్మించిన నల్లా కనెక్షన్‌లు ఇచ్చారు.



లక్ష్మాపూర్‌లో మిషన్‌భగీరథ నీటి సరఫరాపై సర్వే చేస్తున్న అధికారులు

ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం

ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా ఎలా ఉంది? అనే అంశాలపై కొత్త ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శితో పాటు పంచాయతీల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. గ్రామాల్లో పైపులైన్లు పటిష్టంగా ఉన్నాయా..? ట్యాంకుల ద్వారా ప్రతి నల్లాకు నీరు చేరుతుందా? ఎన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు? ఆ కుటుంబాల్లోని సభ్యులకు సరిపడా నీరు అందుతుందా? ఇంకా ఎంతమందికి కనెక్షన్లు ఇవ్వాల్సిన అవసరం ఉంది? అనే అంశాలపై ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. యాప్ ద్వారా సర్వే ప్రక్రియను చేపట్టేందుకు సిబ్బందికి ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇచ్చారు.

సర్వే కొనసాగుతుంది



జిల్లాలో మిషన్‌భగీరథ పథకం ద్వారా ఎంత మందికి శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతుంది. ఇంకా ఎన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలనే విషయాలను గుర్తించేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. కొత్తగా ఎన్ని ఇళ్లు నిర్మించారనే వివరాలను కూడా సేకరిస్తున్నాం.

- వెంకయ్య, జిల్లా పంచాయతీ అధికారి

21మంది కార్యదర్శులకు మెమోలు జారీ

- మిషన్ భగీరథ సర్వేపై నిర్లక్ష్యం

తాండూరు రూరల్, జూన్ 12 : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులపై వికారాబాద్ జిల్లా, తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు.గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సర్వేలో కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ నీటి సరఫరాలపై సమగ్ర వివరాలు సేకరించారు. లబ్ధిదారుడి ఫొటోను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే తాండూరు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఈ సర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఒక్కో కార్యదర్శి 50కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా, కొందరు కార్యదర్శుల సర్వే జీరో ఉండడంతో 33 మంది కార్యదర్శుల్లో 21మంది కార్యదర్శులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. అదే విధంగా మరో ఆరుగురు కార్యదర్శులు మోన్యానాయక్, అమరేశ్వరి, ఇస్మాయిల్, శృతి, అంబిక, ప్రవీణ విధి నిర్వహణలో పూర్తిస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మూడు రోజుల్లో వారు సమాధానం ఇవ్వాల్సి ఉందని ఎంపీడీవో తెలిపారు.

అక్రమ సుద్ద నిల్వలు సీజ్

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన మైన్స్, రెవెన్యూ అధికారులు



మారేపల్లిలో సుద్ద నిల్వల వద్ద విచారణ చేపట్టిన అధికారులు

పెద్దేముల్, జూన్12 : మారేపల్లి సమీపంలో అక్రమంగా తవ్విన సుద్ద గనిని మైనింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. సుద్ద నిల్వలను సీజ్ చేశారు. పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా సుద్ద తవ్వకాలు జరుగుతున్నాయనే విషయమై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సుద్దపై గద్దల్లా.. ' మారేపల్లిలో యథేచ్ఛగా సుద్ద అక్రమ తవ్వకాలు అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో మారేపల్లి సమీపంలో అక్రమంగా తవ్విన సుద్దగనిని మైన్స్, రెవెన్యూ అధికారులు ఏజీ నాగరాజు, ఆర్ఐ నిర్మల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి పరిశీలించారు. అక్రమంగా తవ్విన సుద్దను ఓ పారిశ్రామిక వేత్తకు సంబంధించిన పట్టా భూమిలో ఆయన అనుమతి లేకుండానే డంప్ చేసినట్లు తెలుసుకున్నారు. భూమి యజమాని నుంచి లిఖిత పూర్వకంగా సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్'కు విద్యార్థుల ఎంపిక

కొడంగల్, జూన్ 12: కొడంగల్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు 8మంది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద భువనగిరి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శంకర్‌బాబు బుధవారం తెలిపారు. ఏడో తరగతి విద్యార్థులు ఇటీవలే జరిగిన ఎస్‌వోఈ ప్రవేశపరీక్ష రాసి ప్రతిభ కనబర్చడంతో ఈ అవకాశం లభించిందన్నారు. ఈ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ వరకు నీట్ లెవల్‌లో బోధన అందిస్తారన్నారు.

వేద పాఠశాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, జూన్ 12 : శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ రామభద్ర క్షేత్రంలో గల శ్రీరామభద్ర సంస్కృత వేద పాఠశాలలో ఈ సంవత్సరం చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బుధవారం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్కృత వేద పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. శ్రీరామభద్ర వేద సంస్కృత పాఠశాలలో చేరేందుకు ఉపనయం పూర్తయి 12సంవత్సరాల లోపు వయసున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆ పాఠశాల ఫోన్ నంబర్ 9985559791ను సంప్రదించాలని వారు కోరారు.



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలను చూయిస్తున్న ఎస్ఐ శ్రీశైలంయాదవ్, ఏవో

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

దౌల్తాబాద్, జూన్ 12: నకిలీ పత్తి విత్తనాలు ప్రతీ సంవత్సరం రైతులను నట్టేటా ముంచుతున్నాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని కుదురుమళ్ల గ్రామంలో కమ్మరి వెంకటేశ్ ఇంట్లో ఏవో లావణ్య, ఎస్సై శ్రీశైలం యాదవ్‌తో కలిసి తనిఖీ చేశారు. 19 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా ప్రతీ సంవత్సరం ఏపీ రాష్ట్రం నెల్లూరు జిల్లా ప్రాంతానికి చెందిన వ్యాపారులు కొడంగల్ ప్రాంతంలో పొలాలను లీజుకు తీసుకొని గ్రామాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఈక్రమంలో కొంత మంది అమాయక రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని వారి ఇళ్లలో పత్తి విత్తనాలు నిల్వ ఉంచి వ్యాపారాన్ని గుట్టుగా కొనసాగిస్తున్నారు.







ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్టుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లి‌షలో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్



హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో (www.hycricket.in) నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ పూర్తిగా కొత్త వాళ్లకు కోసం చేపడుతున్నామని దేవ్‌రాజ్ పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి : ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం, జూన్ 12: విద్యార్థులు, యువత డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. ఒక్కసారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే ఇక వారి జీవితం అంధకారమవుతుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పటిష్టమైన నిఘా ఉంచిందని, ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ మధ్య కాలంలో డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాలను గుర్తించి కటకటాల వెనక్కి పంపిన విషయం గుర్తెరగాలన్నారు. సదస్సులో సీఐ సత్యనారాయణ, గురునానక్ విద్యా సంస్థల డైరెక్టర్ కె.వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారధి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషిసాయల్, డీన్ డా.సంజీవ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 12 : మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలను మిషన్ భగీరథ సర్వే నుంచి మినహాయిస్తూ నిర్దిష్టమైన ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ నాయకులురాళ్లు బి.కవిత, బి.రాజ్యలక్ష్మి, వైదేవి, కృష్ణ, పద్మ, బాలమణి తదితరులు ఉన్నారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలి

- ఆ తర్వాతనే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

ఆమనగల్లు, జూన్ 12: రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేయాలని కోరుతూ ఈనెల 15న ఇందిర పార్క్ దగ్గర బీసీల మహా ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మహాధర్నా విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బీసీ జనసభ, బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. మహాధర్నాకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీసీ జనసభ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు కోట శ్రీనివాస్, రఘు, దోనాదుల కుమార్‌లతో కలిసి రాజారాం యాదవ్ ఆవిష్కరించారు. రాజారాం మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా అడ్డుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కులగణన నిర్వహించడం లేదని ఆరోపించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కులగణన చేస్తామని ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ చెప్పినందుకే కాంగ్రెస్‌కు ఎంపీ సీట్లు పెరిగాయన్నారు. టీ-జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకుడు దోనాదుల కుమార్, పద్మశాలి సంఘం గౌడ సంఘం, రజక సంఘం, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులున్నారు.

లక్ష్మాపూర్ భూ సమస్య పరిష్కరించాలి

మూడుచింతల్లి, జూన్ 12 : మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో భూ సమస్యలు పరిష్కరించాలని లక్ష్మాపూర్ నాయకుడు క్యాతం మధుకృష్ణ బుధవారం ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా లక్ష్మాపూర్ గ్రామ భూములకు నక్షలేక ఇబ్బందులు పడుతున్నారని, రికార్డుల్లో ఎక్కక రైతుబంధు, పథకం అందలేదన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ రీసర్వే చేయిస్తామని చెప్పి చేయలేన్నారు. గ్రామ భూములకు నక్ష లేకపోవడంతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మూడుచింతలపల్లి మండల కార్యాలయాలకు ఒక్క సొంత భవనమైనా లేదన్నారు. లక్ష్మాపూర్-మూడుచింతలపల్లిని సంయుక్తంగా మండలంగా ప్రకటించాలని సీఎంను కోరారు. రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి త్వరలోనే భూ సమస్య పరిష్కరిస్తామని చెప్పారని ఆయన తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మధుకృష్ణ

'బెస్ట్ అవైలబుల్ స్కూల్'కు 36 మంది విద్యార్థుల ఎంపిక

వికారాబాద్, జూన్ 12 : బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ స్కూళ్లకు 36 మంది ఎస్సీ విద్యార్థులను ఎంపిక చేశారు. 3వ, 5వ, 8వ తరగతుల్లో అడ్మిషన్ కోసం 60మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, డ్రా తీసి 36మందిని ఎంపిక చేశారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ డ్రా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచితంగా రెసిడెన్షియల్ విద్య అందిస్తామని ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో ఏవో భువనేశ్వరి, సిబ్బంది విజయకుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.



డ్రా తీసి విద్యార్థులను ఎంపిక చేస్తున్న లింగ్యానాయక్

మోగిన బడిగంట

● పాఠశాలలు పునః ప్రారంభం ● వడివడిగా స్కూళ్లకు విద్యార్థులు ● పుస్తకాలు, దుస్తుల అందజేత


పూడూరు: కంకల్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


బషీరాబాద్: మైల్వార్ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జూన్ 12: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాఠశాలలకు చేరుకున్నారు. అయితే చాలా పాఠశాలల్లో మొదటి రోజు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పుస్తకాలు, స్కూలు డ్రెస్సులు పంపిణీ చేశారు. బొంరాస్‌పేట్‌లోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్‌లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుగ్గమ్మ, గ్రామస్తులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, సంతోష్, మతీన్, మహిన్ పటేల్, హెచ్‌ఎం హరిలాల్, టీచర్లు పాల్గొన్నారు.

దోమ: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దిర్సంపల్లి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఇతర సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఎంపీపీ అనసూయ, ఎంఈవో హరిచందర్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ నం.01లో పాఠశాలలో చేపట్టిన పనులను ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య, ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, ఎంఈవో హరిశ్చందర్, హెచ్‌ఎం గోపాల్ పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొదటి రోజు సందడితో కన్పించాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ వచ్చారు. కొన్నింటిలో అసలే రాలేదు. గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. రంగాపూర్‌లో ఎంపీపీ అరవింద్‌రావు, చిట్యాల్‌లో హెచ్‌ఎం ఉస్మాన్‌అలీ పాల్గొన్నారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం దశరథ్ పాల్గొన్నారు.

పూడూరు: ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కంకల్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వ బడుల్లో సకల సదుపాయాలు కల్పిస్తూ పునః ప్రారంభించామన్నారు. బడి ఆవరణలో మొక్క నాటారు. అలాగే కంకల్‌కు అదనపు బస్సు సర్వీసును కేటాయించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ఎంఈవో హరిశ్చందర్, ఎంపీడీవో పాండు, కాంగ్రెస్ నాయకులు సురేందర్, వీరేష్, పెంటయ్య, అజీమ్, శ్రీనివాస్, షకీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సోమన్‌గుర్తి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం అంజిలయ్య, ఎంపీటీసీ సిరిదేవిక, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వప్న పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యాయులు సంగీత, అశోక్, నవీన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు అరుణాదేవి, ప్రభావతి, మాజీ సర్పంచ్ సంధ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని పాఠశాలల్లో దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్, ఎంఈవో హబీబ్ అహ్మద్, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, యాదయ్య, కృష్ణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. ఎంఈవో వెంకటయ్య ఆధ్వర్యంలో కరన్‌కోట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. పాఠశాలలను ఆలయాల్లా మార్చేలా అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కొందరు పాఠశాలలో నల్లాలను ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎల్మకన్నె ప్యాక్స్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, తహసీల్దార్ తారాసింగ్, హెచ్‌ఎం శ్రీనివాస్, నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ శరణుబసప్ప, ఎంపీటీసీలు వసంత్‌కుమార్, శివకుమార్, నాయకులు వడ్డె శ్రీనివాస్, ఉత్తంచంద్, మురళిగౌడ్, జెర్నె నాగప్ప, జగదీశ్వర్, బసప్ప పాల్గొన్నారు. సంగెంకలాన్‌లో ఎంపీపీ ఎస్.అనితాగౌడ్, గౌతాపూర్‌లో కాంగ్రెస్ అధ్యక్షులు నాగప్ప, రాంచంద్రారెడ్డి పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

బషీరాబాద్: మైల్వార్ జడ్పీ పాఠశాలలో ఎమ్మెల్యే విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు టీచర్ల చేతుల్లో ఉందని, ఉపాధ్యాయులు పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ వైస్‌చైర్మన్ అజయ్, మాజీ వైస్‌ఎంపీపీ ఎస్.వెంకటేష్, నాయకులు కలాల్ నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌రావు, బిచ్చిరెడ్డి, రామునాయక్, పి.సుధాకర్‌రెడ్డి, శంకరప్ప, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో రాఘవులు, ఏంఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్: మేడ్చల్ మండలం డబిల్‌పూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు డీఈవో విజయకుమారి, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి పుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేశారు. పలువురు దాతలు విద్యార్థులకు నోట్‌బుక్‌లు, దుస్తులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఎంఈవో వసంతకుమారి పాల్గొన్నారు. అత్వెల్లి పాఠశాలలో కౌన్సిలర్లు దేవరాజ్, సరితమల్లేష్‌గౌడ్, మానసశ్రవణ్ కుమార్ దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. గుండ్లపోచంపల్లిలో కౌన్సిలర్లు శ్రీనివాస్‌యాదవ్, హేమంత్‌రెడ్డి పుస్తకాలు పంపిణీ చేశారు.

కీసర రూరల్: నాగారంలోని జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేసారు. ప్రభుత్వ బడుల్లో ఉత్తమ బోధన ఉంటుందన్నారు. పుస్తకాలు, డ్రెస్సులు, భోజనం అందజేస్తారన్నారు. టెన్త్ పరీక్షల్లో ఈ స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, హెచ్‌ఎం ప్రేమలత, వెంకటేశం, టీచర్లు పాల్గొన్నారు.

వికారాబాద్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. వికారాబాద్ మండలం సిద్దులూర్ పాఠశాలల విద్యార్థులకు జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ చంద్రకళ కమాల్‌రెడ్డిలతో కలిసి దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణిస్తేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, టీచర్లు ప్రతాప్, నర్సిములు, జగదీశ్వరి, చంద్రమౌళి, ఏపీఎం లక్ష్మయ్య విద్యా కమిటీ చైర్మన్, నాయకులు కేదార్‌నాథ్, దత్తు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధారూరు: మండలంలోని పాఠశాలలను శుభ్రం చేశారు. కొన్ని పాఠశాలల్లో ముఖ ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి విద్యార్థులకు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. మొదటిరోజు విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ధారూరు జెడ్పీ పాఠశాలలో జడ్పీటీసీ సుజాత, వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ యాకూబ్ పుస్తకాలు అందజేశారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ జడ్పీ హైస్కూల్‌లో 320మంది విద్యార్థులకు మొదటి రోజు 121మంది, అన్నోజిగూడ హైస్కూల్‌లో 285 మందికి 98మంది విద్యార్థులు హాజరయ్యారు. ఘట్‌కేసర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, అన్నోజిగూడలో మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ రెడ్డియానాయక్, హెచ్‌ఎంలు పాపిరెడ్డి, కవిత, శంకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యాలాల: పాఠశాలల్లో విద్యార్థులకు సదుపాయాలు కల్పించేందుకు సహకరిస్తానని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. యాలాల జెడ్పీ బాలుర పాఠశాలలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ కొడంగల్ పట్టణ అధ్యక్షుడు నయీమ్ యూనిఫాంలు, పుస్తకాలు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తామన్నారు. మండలంలోని ఎరన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 10మంది బడీడు పిల్లలను 1వ తరగతిలో చేరినట్లు హెచ్‌ఎం విష్ణు, టీచర్లు వీరేశంగౌడ్, వెంకటయ్య తెలిపారు.

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన ఉంటుందని ఎంపీపీ కాలె భవానీ అన్నారు. చంచల్‌పేట్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలందజేశారు. మండల ప్రత్యేకాధికారి గోపాల్, ఎంఈవో గోపాల్, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో అజయ్‌కుమార్, ఎంపీవో విజయ్‌కుమార్, హెచ్‌ఎం ఎల్.పాండు, టీచర్లు పాల్గొన్నారు.

తాండూరు: మున్సిపాలిటీలో పండుగ వాతావరణంలో బడులు తెరుచుకున్నాయి. పట్టణంలోని 27పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లు, పుస్తకాలను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు రత్నమాల, శ్రీలత, సంగీతఠాకూర్, టీఎంసీ రాజేంద్రకుమార్, హెచ్‌ఎంలు శివకుమార్, నర్సింహారెడ్డి, అధికారి యాదగిరి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పాఠశాలల ప్రారంభ రోజున విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వచ్చారు. మండలంలోని 26 పాఠశాలల్లో ఒక జత చొప్పున యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నాగారంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి


నవాబుపేట: పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ భవానీ


యాలాల జడ్పీ బాలుర పాఠశాలలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


ఘట్‌కేసర్‌లో పుస్తకాలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని


డబిల్‌పూర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, ఉపాధ్యాయులు


వికారాబాద్: సిద్దులూరులో విద్యార్థికి యూనిఫాం అందజేస్తున్న బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయకుమార్


తాండూరు రూరల్: కరన్‌కోట్ ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ


పరిగి మండలం రంగాపూర్‌లో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అరవింద్‌రావు, ఉపాధ్యాయులు, నాయకులు

వరద ముప్పు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 12 : వరద ముప్పు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మున్సిపల్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నాగావారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో వర్షాభావ పరిస్థితులపై మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కమిషనర్ రాజేందర్‌కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మందుస్తుగా నాలాల్లో పూడిక, పైప్‌లైన్ల జామ్‌లను తొలగించాలని ఆదేశించారు. మ్యాన్‌హోల్ మూతలను తెరిచి ఉంచకూడదని, తెరిచి ఉన్న వాటిని వెంటనే మూసి వేయాలన్నారు. వర్షాకాలం ముగిసేంత వరకు అత్యవసరమైతే తప్ప ఎవరూ సెలవులు పెట్టకూడదని, ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రఘు, మేనేజర్ చంద్రశేఖర్, బిల్ కలెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి'

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 12 : పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నార్కెట్‌పల్లి సబిత డిమాండ్ చేశారు. అవుషాపూర్, మర్రిపల్లిగూడ పంచాయతీల కార్మికులతకు 7 నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని బుధవారం కార్మికులతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పేదలే ఎక్కువగా పనిచేస్తారని, నెలల తరబడి వారికి జీతాలు ఇవ్వకుంటే ఎలా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అవుషాపూర్ పంచాయతీ కార్మికులకు 7 నెలల నుంచి, మర్రిపల్లిగూడకు చెందిన కార్మికులకు గత 9 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారు నెలనెలా మహిళా సంఘాలకు ఈఎంఐలు ఎలా చెల్లిస్తారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ కార్మికులను ఆదుకొని సకాలంలో వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు దానయ్య, బుచ్చయ్య, రామచందర్, లక్ష్మి, పద్మ, బాలరాజు, వీరమ్మ, లక్ష్మణ్, సత్యనారాయణ, జయమ్మ, శేఖర్, కవిత, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాళాల్లో పూడిక లేకుండా చూడాలి

ఘట్‌కేసర్, జూన్ 12 : వర్షాకాలంలో నాళాలను, డ్రైనేజీలను శుభ్రంచేసి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అన్నోజిగూడలోని నాళాలో పూడికతీత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాళాల్లో పూడిక తీసి వరద సాఫీగా వెళ్లిపోయేలా చూడాలన్నారు. ప్రధానంగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉండే నాళాల్లోకి పూడిక పేరుకుంటే వరద నీరు రహదారిపై పారుతుందన్నారు. నాళాల్లో పూడికను తొలగించాలన్నారు. గతంలో జూలై ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురిసేవని, ఇప్పుడు ఎప్పుడు ఎక్కడ కుండపోత వర్షం కురుస్తుందో తెలియడం లేదన్నారు. అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో అన్నోజిగూడ, నారపల్లి, జోడిమెట్ల వద్ద ఉత్పన్నమైన ఇబ్బందులు మరోసారి తలెత్తకుండా చూడాలన్నారు. కాలనీల్లోనీ డ్రైనేజీలను సైతం ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మ్యాన్ హోళ్లపై మూతలు ఏర్పాటు చేయడంతోపాటు, పూడికలు లేకుండా చూడాలని సూచించారు.


అన్నోజిగూడలో పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, జూన్ 12: ఘనపూర్ గ్రామానికి చెందిన చిన్నారి దిలీప్‌కుమార్(4) గుండె సంబంధిత వ్యాధితో మృతిచెందగా ఎన్నారైలు బాలుడి కుటుంబానికి రూ.60వేల సాయం అందించారు. గ్రామానికి చెందిన భీమయ్య, బాలమణి దంపతుల కుమారుడు దిలీప్‌కుమార్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవాడు. మూడు రోజుల క్రితం బాలుడిని హైదరాబాద్‌లోని మెడికేర్, నీలోఫర్ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎన్నారైలు రాఘవేందర్‌రెడ్డి, అభినవ్, సాయికిరణ్, శ్రీకాంత్ స్పందించారు. దిలీప్‌కుమార్ కుటుంబానికి బుధవారం రూ.60వేల సాయం అందించారు.

టీడీపీ, బీజేపీ నేతల సంబరాలు

మేడ్చల్ టౌన్, జూన్ 12 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం మేడ్చల్‌లో టీడీపీ, బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకుడు సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేశారు. తెలుగు ప్రజలకు సేవ చేసే సత్తా తెలుగుదేశం పార్టీకే ఉందని సుధాకర్ అన్నారు. రానున్న కాలంలో తెంగాణలోనూ టీడీపీ అధికారం రావడం తథ్యం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు జగన్‌గౌడ్, ప్రేమ్‌దాస్, టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


స్వీట్ తినిపించుకుంటున్న టీడీపీ, బీజేపీ నాయకులు

తాండూరులో అంతర్గత రోడ్లు జలమయం

● చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు

తాండూరు, జూన్ 12 : తాండూరులోని పలు కాలనీలు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయ్యాయి. బుధవారం ఉదయం రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భవానీనగర్, ముత్యాలగల్లీ, మార్కెండేయ కాలనీ, మిత్రనగర్, గ్రీన్‌సిటీ ప్రాంతాల్లో రోడ్లు నీటితో నిండాయి. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. భవానీనగర్‌లోని హాస్టల్ వద్ద రోడ్డు, నంబర్ హైస్కూల్ ముందు గల రోడ్డులో నీరు నిలిచింది. మంగళవారం రాత్రి 9గంటలకు నీరు నిలిచి రాకపోకలు స్తంభించాయి. ముత్యాలగల్లీలో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. చిలుకవాగు ప్రవహించే మార్కండేయనగర్, మిత్రనగర్, గ్రీట్‌పిటీ ప్రాంతాల్లోనూ అంతర్గత రోడ్లు జలమయ్యాయి.


భవానీ నగర్‌లో హాస్టల్ వద్ద నిలిచిన నీరు

హోటళ్లు, స్వీట్ హౌసుల్లో మునిసిపల్ అధికారుల తనిఖీలు

వికారాబాద్, జూన్ 12: వికారాబాద్‌లో బుధవారం మునిసిపల్ అధికారులు హోటళ్లు, బేకరీలు, స్వీట్‌హౌస్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో ఆహార పదార్థాలు, వంట శాలలు, పాత్రలు ఏ మేర శుభ్రంగా ఉన్నాయో పరిశీలించారు. అపరిశుభ్రత నెలకొన్న హోటళ్లు, బేకరీలు, స్వీట్‌హౌస్‌లలో శుభ్రత పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మన్నికైన వంట నూనెలే వినియోగించాలని, నల్లగా మారేంత వరకు ఉపయోగించకూడదన్నారు. చికెన్, మటన్, ఫిష్ ఫ్రీజర్లలో నిల్వ చేయవద్దన్నారు. పరిశుభ్రత మెయింటెన్ చేయని హోటళ్ల యజమానులకు జరిమానా విధించామన్నారు. అయితే ఎన్ని హోటళ్లకు ఎంత మేర జరిమానా వేశారో అధికారులు వెల్లడించలేదు. తనిఖీల్లో మునిసిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వీట్ హౌస్‌లో తనిఖీ చేస్తున్న శానిటేషన్ విభాగ అధికారులు

మాజీ జడ్పీటీసీ అంత్యక్రియల్లో నాయకులు

దౌల్తాబాద్, జూన్ 12:దౌల్తాబాద్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ మోహన్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. మోహన్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ మోహన్‌రెడ్డి మృతి బాధాకరం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, నాయకులు వెంకట్రావ్, శ్రీరామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జింకపై కుక్కల దాడి.. తీవ్ర గాయాలు

పూడూరు, జూన్ 12 : జింకపై కుక్కలు దాడి చేసిన సంఘటన దామగుండం అటవీ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దామగుండం అటవీ ప్రాంతంలో కుక్కలు జింకపై దాడి చేసి గాయపర్చాయి. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న అధికారులు జింకను పశువుల ఆసుపత్రికి తరలించారు. గతంలోనూ పదుల సంఖ్యలో జింకలు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయాయి. అటవీ ప్రాంతంలో తరచూ జింకలపై కుక్కలు దాడి చేస్తున్నాయని, జింకల రక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులకు స్థానికులు విన్నవించారు.


గాయపడిన జింక

ఆర్థిక ఇబ్బందులతో రియల్ వ్యాపారి అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సద్భావన టౌన్‌షిప్‌కు చెందిన గారె ప్రసాద్(41) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 10న ప్రసాద్ ఇంట్లో ఫోన్‌పెట్టి ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోయే సరికి కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వేతికినా లభ్యం కాలేదు. దీంతో ప్రసాద్ కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో ప్రసాద్ గ్రే కలర్ ప్యాంట్, ఆరెంజ్ కలర్ షర్ట్ ధరించారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రసాద్

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** బషీరాబాద్ ఎస్సీ హాస్టల్(బాలురు) భవనం మరమ్మతులకు రూ.6లక్షలు మంజూరైనట్లు వార్డెన్ రాజేశ్వర్ తెలిపారు. పాత భవనం కావడంతో కలెక్టర్ మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో భవనం పైకప్పు, ఫ్లోరింగ్, కిటికీలు వంటి పనులు చేపడతామన్నారు. పనులు కాంట్రాక్టర్ ప్రారంభించినట్లు వెల్లడించారు.

పెద్దేముల్: మంబాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న చాకలి రాములు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. గ్రామానికి చెందిన పెద్దేముల్ సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి రాములు కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సహాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మైపూస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు:** మల్కపల్లిలో అక్రమంగా చేపడుతున్న సుద్ద తవ్వకాలపై చర్యలు తీసుకోవడంతో పాటు సుద్ద నిల్వపెట్టిన కోఫియా మైనింగ్ లిమిటెడ్ ఓనర్ ఆల్బర్ట్ చాకోపై కేసు నమోదు చేయాలని, సుద్దను సీజ్‌చేయాలని జనసత్తా వెల్ఫేర్ జిల్లా ఆర్గనైజింగ్ అధ్యక్షుడు సూరజ్‌సింగ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. పారిశ్రామికవేత్తలు అక్రమాలను ప్రోత్సహిస్తే చర్యలు ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నించారు. విచారణ జాప్యం చేస్తే దొంగ రాయల్టీలు సృష్టించి తప్పించుకుంటారని అన్నారు.

● **ఘట్‌కేసర్:** జనావాసాల మధ్య నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేయాలని ఘట్‌కేసర్ అంబేడ్కర్ నగర్ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. బుధవారం కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పద్మారెడ్డి గార్డెన్ వద్ద సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్‌తో ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. టవర్ మధ్య నిర్మాణానికి అనుమతి ఇవ్వడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై ఉన్నతాధికారులకు వివరిస్తానని కమిషనర్ వారికి తెలిపారు. అనంతరం కౌన్సిలర్ పద్మారావుకు సైతం వినతిపత్రం ఇచ్చారు.

●**శామీర్‌పేట:** స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. యాడారానికి చెందిన సత్యనారాయణ శామీర్‌పేటలోని జడ్పీ పాఠశాలలో 1999-2000లో టెన్త్ చదివాడు. కాగా ఆయన అనారోగ్యంతో మే 22న మృతిచెందాడు. స్నేహితుడి మృతి విషయాన్ని తెలుసుకున్న అతడి టెన్త్ క్లాస్‌మేట్లు 20మంది గ్రామానికి వెళ్లి స్నేహితుడి కుటుంబీకులను పరామర్శించి రూ.50 వేలు సాయాన్ని అందజేసి బాసటగా నిలిచారు.

● **బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేటలో దుర్గమాత ఉత్సవాలుప్రారంభమయ్యాయి. ప్రతీ సంవత్సరం ఏరువాకకు ముందు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల/మోమిన్‌పేట్/పూడూరు/తాండూరు రూరల్/వికారాబాద్/జూన్ 12: పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషిచేస్తామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం యాలాల మండల పరిషత్‌లో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని, తరువాత ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. తాండూరు ప్రాంతంలో రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించేలా చూస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శివసాగర్ ప్రాజెక్టు పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. జుంటుపల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టుల మరమ్మతులను చేస్తామన్నారు. అనంతరం జుంటుపల్లి తూము పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో ప్యాక్స్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రమేష్, అక్బర్‌బాబ, ఎంపీడీవో పుష్పలీల, ఎంఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మోమిన్‌పేట్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వడ్ల నందు, చేవేళ్ల పార్లమెంట్ లీగల్‌సెల్ కన్వీనర్ రమేశ్, సాయిరాంరెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఆశిరెడ్డి, బ్రహ్మాంచారి, రఘునాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని పూడూరు మండల మన్నెగూడ చౌరస్తా వద్ద నాయకులు సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్, నవీన్ పాల్గొన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని గౌతాపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి సన్మానించారు. ఎంపీకి నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ వడ్ల నందు ఘనస్వాగతం పలికారు. ధారూరు ప్యాక్స్ వైస్‌చైర్మన్ రాజు, వైస్‌ఎంపీపీ రాములు, ఎంపీటీసీలు శ్రీకాంత్‌రెడ్డి, బందయ్య, గోపాల్, శరణ్‌రెడ్డి పాల్గొన్నారు.